క్లుప్తంగా

ట్యాంక్ వద్ద పారిశుద్ధ్య పనులు


ట్యాంక్ వద్ద మట్టిని చదును చేస్తున్న జేసీబీ

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ వద్ద శుక్రవారం సర్పంచ్ శివరాముడు శుభ్రం చేయించారు. ట్యాంక్ చుట్టు పక్కల పిచ్చిమొక్కలు, మురుగునీరు నిల్వ ఉండి అపరిశుభ్రంగా మారడంతో జేసీబీతో మొక్కలు తొలగించి మట్టితో చదును చేయించారు. వాటర్‌మెన్ నీళ్లు వదిలేందుకు వచ్చే సమయంలో ట్యాంక్ వద్ద ఇబ్బందిగా ఉండేది. ఎస్సీల శ్మశాన వాటికి దారి అస్తవ్యస్తంగా మారడంతో ట్రాక్టర్లతో మట్టిని తోలి దారిని తయారు చేయించినట్లు సర్పంచ్ తెలిపారు.

డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీ ప్లస్ గ్రేడ్


హర్షం వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

డోన్ టౌన్: డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ బీ ప్లస్ గ్రేడ్ లభించినట్లు ప్రిన్సిపాల్ భారతి తెలిపారు. ఇటీవల కళాశాలను నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) సభ్యులు సందర్శించారన్నారు. 2015లో 2.18 స్కోరుతో బీ క్యాటగిరిలో నిలువగా 2025లో జరిపిన సర్వేలో 2.66 స్కోరుతో బీ ప్లస్ సాధించినట్లు తెలిపారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య, వసతులు, అవకాశాలు, ప్రవేశాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థుల భాగస్వామ్యం, ఉత్తీర్ణత తదితర అంశాలపై న్యాక్ కోర్ కమిటీ సభ్యులు సర్వే చేసి మార్కులు ఇచ్చినట్లు వివరించారు. శుక్రవారం అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి విజయోత్సవ సభ నిర్వహించారు. గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించడంతో హర్షం వ్యక్తం చేశారు. అధ్యాపకులను అభినందించారు.

వైభవంగా తిరుచ్చి ఉత్సవం


మద్దిలేటి నరసింహస్వామి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితులు జ్వాలా చక్రవర్తి, అర్చకులు మనోహర్ ఆధ్వర్యంలో మద్దిలేటి నరసింహస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీల్లో కొలువుంచి ఆలయ మాడ వీధుల్లో మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణ నడుమ ఊరేగింపు సాగింది.

వేడుకగా చౌడేశ్వరి పల్లకీ సేవ


పల్లకీసేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి నైవేద్య సమర్పణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని పల్లకీపై కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సహజం


తులసీదేవిని సత్కరిస్తున్న ఉద్యోగులు

డోన్ టౌన్: ఉద్యోగులకు పదవీ విరమణ సహజం అని ఎల్ఐసీ డోన్ బ్రాంచ్ మేనేజర్ రాముడు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు, ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రహంతుల్లా, దేవన్న అన్నారు. స్థానిక కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారిణిగా విధులు నిర్వహిస్తూ శుక్రవారం పదవీ విరమణ పొందిన తులసీదేవిని ఉద్యోగులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయండి

- వైఎస్సార్‌సీపీ నేతలతో మాజీ మంత్రి బుగ్గన


పార్టీ నాయకులతో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్/డోన్ టౌన్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఇటీవల నియమితులైన పార్టీ డోన్ నియోజకవర్గ అనుబంధల సంస్థల అధ్యక్షులు శుక్రవారం బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బుగ్గన మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కష్టపడి పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టిన విషయాన్ని ప్రతి కుటుంబానికి వివరించాలని సూచించారు. బుగ్గనను సత్కరించిన వారిలో ఆర్ఈ రాజవర్దన్, దూదేకుల ఆమని, కమతం భాస్కర్‌రెడ్డి, తపాల మద్దిలేటినాయుడు, తిక్క వెంకటేశ్వర్లు, రామతీర్థం నాయక్, సాధిక్ అహ్మద్, చాబోలు ప్రకాష్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కటిక వేణుగోపాల్, మిడుతూరు రాఘవేంద్రరెడ్డి, పసుపల కీర్తి, రాచెర్ల నాగిరెడ్డి, రాజా మురళీకృష్ణ, శివశంకర్, ఎర్రమల, మంజుల, మధుసూదన్‌రెడ్డి, సలీం, తంబటి సతీష్, రామ్‌కుమార్, ఉదయభాస్కర్, బంగారు జయచంద్ర, పుట్టలపల్లి శ్రీనివాసులు, చిరంజీవి, బోరెడ్డి రామచంద్రారెడ్డి, మల్లికార్జునరెడ్డి, నిత్యానందం, అక్బర్‌బాషా, అబ్దుల్లా తదితరులు ఉన్నారు.


బుగ్గనను సత్కరిస్తున్న మైనార్టీ నాయకులు

ముగిసిన పశుఆరోగ్య శిబిరాలు

కొలిమిగుండ్ల: మండలంలో ఈనెల 20న ప్రారంభమైన పశుఆరోగ్య శిబిరాలు గురువారంతో ముగిశాయని పశువైద్యాధికారి రమేష్‌బాబు తెలిపారు. చివరి రోజు కొలిమిగుండ్ల, చింతలాయిపల్లె గ్రామాల్లో నిర్వహించామన్నారు. పశువులకు వైద్య పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు చెప్పారు. జీవాలకు నట్టల నివారణ మందులు వేశామని తెలిపారు. ఈ శిబిరాల వల్ల రైతులకు చాలా ఉపయోగకరంగా మారిందన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారి

264 పశువులకు వైద్యపరీక్షలు

కోవెలకుంట్ల: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని కంపమల్లలో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య పశువైద్య శిబిరంలో 264 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కోవెలకుంట్ల పశువైద్యాధికారి కృష్ణకుమార్ తెలిపారు. ఇందులో 47 పశువులకు సాధారణ వైద్య పరీక్షలు, 55 జీవాలకు టీకాలు, ఒక ఎదసూది, ఎనిమిది గర్భకోశ వ్యాధులు, 12 గర్భ నిర్ధారణ కేసులు, 141 దూడలు, పశువులు, జీవాలకు నట్టల నివారణ, చికిత్సలు చేసినట్లు పేర్కొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోవెలకుంట్ల: 2024–25 ఆర్థిక సంవత్సరానికి బీసీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి రుణాలు మంజూరు చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి పథకాల ద్వారా జీవనోపాధి కల్పించేందుకు సబ్సిడీ రుణాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీ–ఏకు 23, బీసీ–బీకి 14, బీసీ–డీకి ఏడు, బీసీ–ఈకి 11 యూనిట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మండలంలోని బీసీ కులాలకు చెందిన వ్యక్తులు https:apobmms.apcfss.in వెబ్‌సైట్‌లో ఫిబ్రవరి 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

50 శాతం రాయితీతో రుణాలు

సంజామల: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సాల్మన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి 55 యూనిట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఇందులో బీసీ(ఏ)–23, బీసీ(బీ)–14, బీసీ(డీ)–7, బీసీ(ఈ)–11 యునిట్లు ఉన్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 50 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

గ్రూపు ఆలయాలకు రూ.3 లక్షల ఆదాయం

బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేటలో వెలసిన ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి, మాధవ, గట్ల నరసింహస్వామి ఆలయాల్లో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను శుక్రవారం లెక్కించారు. సుమారు 18 నెలల కాలానికి సంబంధించి రూ.3,08,683 నగదు, 7.870 గ్రాముల బంగారం వచ్చినట్లు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆలయ ఈఓ మద్దిలేటి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బుగ్గన శ్రీధర్ రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.


హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

హుండీ కానుకల లెక్కింపు

మండల పరిధిలోని ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. 11 నెలలకు సంబంధించి రూ.1,05,925 ఆదాయం వచ్చినట్లు ఈఓ మద్దిలేటిస్వామి తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆలయ మాజీ చైర్మన్ యామసాని జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

డెంగీ జ్వరాలపై అవగాహన కల్పించాలి


రికార్డులను పరిశీలిస్తున్న జోనల్ అధికారి

ప్యాపిలి: దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జోనల్ మలేరియా అధికారి లక్ష్మనాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులు వాణిశ్రీ, నితీశ్‌ల ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కీటక జనిత వ్యాధులు మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడువాపు వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దోమ కాటుకు గురి కాకుండా ఉండేందుకు ప్రజలు తీసుకోవాల్సిన చర్యలను వివరించాలన్నారు. మలేరియా నిర్మూలన కోసం జనాభాలో 10 శాతం మందితో రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపాలన్నారు.

పోతిరెడ్డిపై హత్యాయత్నం కేసు

కొలిమిగుండ్ల: బెలుంకు చెందిన పారిశ్రామికవేత్త పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డిపై శుక్రవారం పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వివరాలు.. బెలుం– బెలుం శింగవరం గ్రామాల మధ్యలో బెలుంకు చెందిన బాచం ప్రతాప్‌రెడ్డి నాపరాతి గని నిర్వహిస్తున్నాడు. వెంకటసుబ్బారెడ్డి, సాయిబాబా గని వద్దకు వెళ్లి హత్యాయత్నం చేసేందుకు ప్రయత్నించారు. ఈ మేరకు బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి 2014–19 వరకు టీడీపీలో కొలిమిగుండ్ల మండలంలో క్రియాశీలకంగా పని చేశాడు. 2024లో ఎన్నికల కంటే ముందుగా నెలకొన్న పరిణామాల వల్ల టీడీపీకి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆయన తండ్రి పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి పేరు మీద కొలిమిగుండ్లలో సేవా ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. సీనియర్ నాయకుడు, పారిశ్రామికవేత్త అయిన వెంకటసుబ్బారెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు కావడంతో మండలంలో చర్చనీయాంశమైంది.

పశుపోషణలో జాగ్రత్తలు అవసరం

డోన్: పశుపోషణలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభదాయకంగా ఉంటుందని డోన్ పశు వైద్యశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు డాక్టర్ నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక పశు వైద్యశాలలో గొర్రెలు, మేకలు, ఎద్దులు, ఆవులు, బర్రెలకు నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. నట్టల నివారణ, కృత్రిమ గర్భాధారణ చేయించడం, ఎదకు రాని జీవాలకు టీకాలు వేయించడం, నట్టల నివారణకు ద్రావకం తాపించడం లాంటి కార్యక్రమాల వల్ల పాలదిగుబడి పెరగడంతో పాటు పశువుల ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. గొంతు వాపు, జబ్బ వాపు నివారణకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలన్నారు. పశుగ్రాస క్షేత్రాలు సబ్సిడీపై పొంది గడ్డిని పెంచుకోవాలని పశు యజమానులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మహమ్మద్ రఫీ, నవ్య, సిబ్బంది సుజాత, షేక్షావలి పాల్గొన్నారు.


గొర్రెలకు నట్టల నివారణ మందును తాపుతున్న పశువైద్య సిబ్బంది

అరుదైన పొటేలు జాతి

పట్టణంలోని డాక్టర్ సుందర్‌సింగ్ కాలనీకి చెందిన మీనిగ మధు ఎల్లగడ బ్రీడ్‌కు చెందిన పొటేలును పశు వైద్యశాలకు చికిత్స కోసం తీసుకురావడంతో అందరినీ ఆకర్షించింది. ఐదేళ్ల వయసు గల పొటేల్ పిల్లను కర్ణాటక రాష్ట్రం బాదల్‌కోట్ సంతలో రూ.2.10 లక్షలకు కొనుగోలు చేసినట్లు యజమాని తెలిపాడు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జరిగే పొటేలు పోటీల్లో పాల్గొని నగదు బహుమతులు సాధించినట్లు చెప్పారు.

ఏఎస్ఐ బాధ్యతల స్వీకరణ

కొలిమిగుండ్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా బాబా ఫ్రక్రుద్దీన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూరులో విధులు నిర్వహిస్తున్న ఆయన్ను ఉన్నతాధికారులు కొలిమిగుండ్లకు బదిలీ చేశారు. గతంలో ఇక్కడ హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్ఐగా పని చేశారు. ఆయనకు ఇంకా మూడేళ్ల సర్వీస్ ఉంది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: మండలంలోని వెంకటాపురం 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు పనుల కారణంగా వెంకటాపురం, బొంతిరాళ్ల, గుమ్మకొండ గ్రామాల్లో శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ ఉండదని రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్ తెల్లవారుజామున 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

సినిమా థియేటర్‌లో ఘర్షణ

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీరామ థియేటర్‌లో ప్రేక్షకులు, సినిమా థియేటర్ ఉద్యోగి మధ్య శుక్రవారం వాగ్వాదం చోటుచేసుకుంది. పట్టణంలోని కొండపేటకు చెందిన రాజేష్ ఖన్నా కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూడటానికి వెళ్లాడు. పిల్లలకు కూడా టిక్కెట్ తీసుకోవాలని అక్కడి ఉద్యోగి బాషా చెప్పడంతో ఇద్దరి మధ్య మాటమాట పెరిగింది. ఒకరిపై ఒక్కరు దాడి చేసుకున్నారు. గమనించిన థియేటర్ యజమాని వారించి పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

చీటీల వ్యాపారి అదృశ్యం

డోన్ టౌన్: రెండు నెలల క్రితం పట్టణంలో అధిక వడ్డీ ఆశతో క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెట్టి కోట్ల రుపాయాలు నష్టపోయిన ఉదంతం మరువక ముందే పట్టణంలో ఓ చీటీల వ్యాపారి అదృశ్యమవడం చర్చనీయాంశం అయ్యింది. రైల్వేస్టేషన్ రోడ్డులోని చింత చెట్ల సమీపంలో మాంసం విక్రయించే టీచర్స్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి చీటీల పేరుతో పలువురి నుంచి రూ.కోటి వరకు వసూలు చేసినట్లు తెలిసింది. అతను అదృశ్యం అయినట్లు శుక్రవారం పట్టణంలో సమాచారం వ్యాపించడంతో చీటీలు వేసిన వారు ఆందోళన చెందుతున్నారు.

నివాళి


మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నాయకులు

బేతంచెర్ల: పట్టణంలోని ఆసర్‌పేట కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సయ్యద్ బషీర్ కుమారుడు ఇస్మాయిల్ (37) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ మాజీ డైరక్టర్ మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పిట్టల జాకీర్, గోరుమాను కొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు ఇస్మాయిల్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సారా జోలికి వెళితే కఠిన చర్యలు


సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

- నంద్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు

అవుకు: నాటుసారా తయారీ చట్టరీత్యా నేరమని నంద్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు అన్నారు. శుక్రవారం అవుకు మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామ శివారులో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. సారా తయారీ బట్టీలను ధ్వంసం చేశారు. సుమారు 2,400 లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. సారా తయారీకి వినియోగించిన సామగ్రిని కాల్చేసారు. అలాగే బెల్లం ఊటను దాచిన డ్రమ్ములు, క్యాన్లు, బిందెలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటుసారా తయారీ, క్రయావిక్రయాలు, రవాణా చేస్తే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. జీవితం నాశం చేసుకోవద్దని హితవుపలికారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సారా తయారీని మానుకోవాలని సూచించారు. పూర్తి స్థాయిలో సారా తయారీదారులపై దృష్టి సారిస్తామని, ఎప్పుడైనా దాడులు జరుగవచ్చన్నారు. నంద్యాల డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ దాస్, సీఐ రూప్‌సింగ్, ఓబులేసు, కృష్ణయ్య, నాగరాజు, రవికుమార్ పాల్గొన్నారు.

180 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్యాపిలి/డోన్‌రూరల్: ప్యాపిలి మండల పరిధిలోని అలేబాదు తండా సమీపంలో డోన్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి, ఎస్ఐలు సోమశేఖర్, దౌలత్‌ఖాన్ తదితరులు వాహన తనిఖీలు నిర్వహించారు. అలేబాదుతండాకు చెందిన పితావత్ కృష్ణానాయక్, ముడావత్ భాస్కర్ నాయక్ ద్విచక్రవాహనాల్లో నాటుసారా తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి చెరో 90 లీటర్ల చొప్పున మొత్తం 180 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు సారా తరలిస్తున్న రెండు ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. ఎవరైనా నాటు సారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మీ హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా సారా తయారు చేస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.


నాటుసారా స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ ఎస్ఐ, సిబ్బంది

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం


బేతంచెర్ల: వాసవీ మాతకు పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని కొండపేటలో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. పూజల అనంతరం మంత్రిని ఆర్యవైశ్యులు ఘనంగా సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు శ్రీరామ వెంకటసుబ్రమణ్యం, పీఎస్ఎస్ సత్యనారాయణ, గాథం శెట్టి వేణుగోపాల్, జంగంశెట్టి, గుండా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


బనగానపల్లె: అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి బీసీ దంపతులు

- **బేతంచెర్ల:** పట్టణంలోని అమ్మవారిశాలలో విశేష పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులు గుండా గోపాలు, కందగడ్డల జనార్దన్ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి మహా మంగళహారతులు సమర్పించారు. వాసవీ, వనితా క్లబ్ సభ్యులు సుధీర్, ఇందుమతి, కందగడ్డల మోహన్‌రావు, రమణ, సురేంద్ర, శేషా మోహన్, లక్ష్మీనారాయణ, గుప్త పాల్గొన్నారు.

- **సంజామల:** మండల కేంద్రంలోని అమ్మవారిశాలలో వాసవీ కన్యాకపరమేశ్వరిదేవి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకాలు నిర్వహించారు.



బేతంచెర్ల: ప్రత్యేక పుష్పాలంకరణలో వాసవీమాత, సంజామలలో..


పొలాల్లో నీటి నిల్వను చూపిస్తున్న బాధిత రైతులు, నీరు వెళ్లకుండా కాల్వలో అడ్డుకట్ట వేసిన దృశ్యం, నీటితో నిండిన పొలం

నీరున్నా.. సాగుకు దూరం!

- ఎస్సార్‌బీసీ అసంపూర్తి పనులతో పొలాల్లో నీరు
- నాలుగేళ్ల నుంచి తీరని సమస్య
- శివవరం రైతుల ఆవేదన

అవుకు: పొలాలు ఉన్నాయి.. పంటలు పండించే శక్తి ఉంది.. కావాల్సినంత నీరు ఉంది. అయితే ఆ నీరే రైతుల పాలిట శాపంగా మారింది. పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. అవుకు మండలం శివవరం గ్రామంలో రైతులు రవిప్రకాశ్‌రెడ్డి, సూర్య నారాయణ రెడ్డి, వెంకటసుధాకర్ రెడ్డి, నామాల పుల్లమ్మ, వెంకట సుబ్బమ్మ, శివవరం గయ్య, శ్రీనివాసులు, నాగజ్యోతి, నాగలత, నాగ చందన, నాగేంద్రనాథ్ రెడ్డిలకు సర్వేనంబర్లు 356/1, 356/3, 360లో సుమారు 18 ఎకరాల భూమి ఉంది. 12 ఏళ్ల క్రితం కోవెలకుంట్ల సబ్ డివిజన్‌లో ఎస్సార్బీసీ 8ఆర్ కాలువ నిర్మాణం జరిగింది. ఈ కాలువ శివవరం గ్రామంలో పూర్తిగా చేయకపోవడంతో కాలువల లీకేజీ నీరు పొలాల్లోకి చేరేది. పొలాలు సాగులోకి తెచ్చుకోవాలనే ఉద్దేశంతో రైతులందరూ కలిసి తమ పొలాల్లోనే కాలువను ఏర్పాటు చేసుకుని ఆ కాలువ గొల్లలేరు డ్రైన్‌కు కలిపారు. అయితే ఇదే గ్రామానికి చెందిన కొందరు భూ ఆసాములు సొంత ప్రయోజనాల కోసం బాధిత రైతుల పొలాలకు ఆనుకుని ఉన్న కాలువ వద్ద అడ్డుకట్ట వేసి రోడ్డు అవతల ఉన్న భూ ఆసాముల పొలాలకు నీరు మళ్లించుకుంటున్నారు. దీని వల్ల నీరు కాలువలో సాఫీగా వెళ్లలేక పొలాల్లో నీరు నిల్వ చేరింది. నాలుగేళ్ల నుంచి సాగుకు వీలు లేకుండా పోయిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కోవెలకుంట్ల డివిజన్ ఎస్సార్బీసీ అధికారులు ఇలా వచ్చి.. అలా వెళ్తున్నారే తప్ప తమకు న్యాయం చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కోవెలకుంట్ల డివిజన్ ఎస్సార్బీసీ డీఈఈ అంకిరెడ్డిని వివరణ కోరగా రైతులకు సమస్య ఉన్న మాట వాస్తవమేనని.. త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.